కరుణించని వరుణుడు!

- వరిసాగుపై తీవ్ర ప్రభావం
- ముదురిపోతున్న వరినారు
- ఆందోళనలో అన్నదాత

కవిటి:

వరుణుడు కరుణించకపోవడంతో ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలు తాజాగా ముఖం చాటేయడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి అన్నదాత ఎదుర్కొంటున్నాడు. కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో ఉన్న బీల ప్రాంతాల్లో చిత్తడి నేలల స్వభావరీత్యా నీటి ఊటలు భూమిలో తేమను కాపాడుతాయి. కానీ ఈ ఏడాది జూన్ నెల రెండో పక్షం నుంచి ఇప్పటి వరకు వర్షాలు ముఖం చాటేయడంతో నారుమడులను బతికించుకోవడమే బీల, మెట్ట ప్రాంతం రైతులకు తలనొప్పిగా మారింది. సోంపేట సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 11,311 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు, వరి విత్తనాలు పంపిణీ చేసింది. కవిటి మండలంలోని బైరిపురం, చండీపురం, వింజగిరి, కమలాయిపుట్టుక, ఆర్.కరపాడు, గొర్లెపాడు, బెలగాం, శిలగం గ్రామాల్లో వరి పంట గత ఏడాది నుంచి రైతులకు కలిసి రావడం లేదు. దీర్ఘకాలిక వరి వంగడాల సాగు బీల ప్రాంత రైతులకు సంకటంగా మారింది. జూన్‌లో కురిసిన వర్షాలకు వరినారు మడులను రైతులు సిద్ధం చేసుకున్నారు. నారుపోసి 30 రోజులు దాటిపోయింది. అయితే ప్రస్తుతం వర్షాలు లేకపవోడంతో వరి నారు ముదిరిపోతుండడంతో ఏం చేయాలో తెలియక రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఆర్‌జీఎల్ రకం వరి బీల ప్రాంతంలో అధికంగా సాగు చేస్తున్నారు. దీనికోసం జూన్ మొదటి వారంలోనే నారు కోసం విత్తనాలు వేసి సిద్ధం చేశారు. అయితే వర్షాలు లేకపోవడంతో నారు ముదురిపోయే పరిస్థితి నెలకుంది. మంగళవారం సాయంత్రం బీల ప్రాంతంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురవగా.. మెట్ట ప్రాంతానికి చినుకు జాడ లేకుండా పోయింది.



ఊభాలకు సిద్ధంకాని రాజపురంలోని పొలాలు

రైతుల పట్ల సానుభూతి చూపాలి



ప్రస్తుతం ఉద్దానం బీల ప్రాంతంలో నెలకున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బోరు బావులతో సాగుకు మాత్రమే అవకాశం ఉంది. కవిటి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బీల రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా అందించాలి. రైతుల పట్ల విద్యుతశాఖ అధికారులు సానుభూతితో వ్యవహరించి వారికి మేలు కలిగించే చర్యలు తీసుకోవాలి. ఉచిత విద్యుత్ సరఫరాలో కోతలు తగ్గించేలా వ్యవహరించాలి.

– పూడి నీలాచలం, రైతు, కవిటికొత్తూరు

స్వల్పకాలిక వరి విత్తనాలు సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్ సాగు కోసం పచ్చిరొట్ట ఎరువులు, వరి విత్తనాలు సకాలంలో అందించాం. కానీ దురదృష్టవశాత్తు వర్షాలు ముఖం చాటేయడం బాధాకరం. దీన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్వల్పకాలిక వరి వంగడమైన శ్రీధృతి విత్తనాలు సిద్ధం చేశారు. కావాల్సిన రైతులు ఏవోలకు సంప్రదిస్తే అందించేందుకు జిల్లా ఉన్నతాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

–టి.భవానీ శంకరరావు, సోంపేటసబ్ డివిజన్

చంద్రబాబు అబద్ధాలు గుర్తు చేయండి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

- వైఎస్సార్‌సీపీ నందిగాం మండల విస్తృత స్థాయి సమావేశంలో తిలక్

నందిగాం: ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన అబద్ధాలను ప్రజలకు గుర్తు చేయడమే బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. నందిగాంలోని సీతారామ కళ్యాణ మండపంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ మండలస్థాయి విస్తృత సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేసిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండలంలో ఏర్పాటు చేసిన వివిధ శాశ్వత పనులను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే మంత్రిగా అచ్చెన్నాయుడు మండలానికి చేసిన శాశ్వత పని ఏదీ లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ మంత్రిగా ఉంటూ మండలానికి అత్యంత ఆవశ్యకమైన ఆఫ్‌షోర్‌ను పూర్తి చేయలేకపోయారని, నిర్మాణం చేసిన విత్తనోత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించలేదని ఎద్దేవా చేశారు. ప్రతి ఎన్నికల్లో చంద్రబాబు అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. 2014లో ఆరు వందల హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదని, అలాగే 2024లో కూడా సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చినప్పటికీ దేన్నీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్ రూ. నాలుగు వేలు చేశామంటూనే పింఛన్ల తొలగింపు కోసం గ్రామాల్లో ధ్రువపత్రాల పరిశీలన చేస్తున్నారని విమర్శించారు. తల్లికి వందనం కోసం సుమారు రూ.13 వేల కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో రూ. 8,300 కోట్లు కేటాయించి 25 లక్షల మందికి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని.. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లవచ్చని చెప్పి ఏడాది కాలయాపన చేశారని.. ఇప్పుడు జిల్లాకే పరిమితం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. మహిళలకు నెలకు రూ. 15 వందలు లేదు, నిరుద్యోగభృతి లేదు, రైతులకు సాయం లేదు అంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు అచ్చెన్నాయుడును భూతంగా చూపి గ్రామాల్లో అరాచకాలు చేస్తున్నారని అన్నారు. కూటమి నాయకులు చెప్పి చేయలేకపోయిన ప్రతి ఒక్క హామీని ప్రజల్లోని బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కార్యకర్తల వల్లే తాను నాయకుడిని అయ్యానని, వారి తరఫున చివరి వరకు నిలబడతానని చెప్పారు. పంచాయతీ స్థాయిలో ఇన్‌చార్జిలను నియామకం చేశామని, వారు గ్రామాల్లో పార్టీ బాధ్యతలు తీసుకొని యువజన, రైతు, మహిళా అధ్యక్షులను నియామకం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ పంచాయతీ ఇన్‌చార్జిలతో తిలక్ ప్రమాణం చేయించారు. అలాగే రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ యువజన విభాగం కార్యదర్శి యర్ర చక్రవర్తి, పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, పోలాకి మోహనరావు, కణితి నారాయణమూర్తి, అక్కురాడ లోకనాథం, జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, గున్నయ్య, వివిధ అనుబంధ విభాగపు అధ్యక్షులు కింతలి శేషగిరి, తమిరె రాజు, పూడి ఆశారాణి, నందిగాం శ్యామసుందరరావు, కంచరాన శ్రీధర్, రేగల కూర్మారావు, బార్నాన బాలక్రిష్ణ పాల్గొన్నారు.



పంచాయతీ ఇన్‌చార్జిలతో ప్రమాణం చేయిస్తున్న తిలక్



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

డిసెంబర్ నాటికి టిడ్కో గృహాల అందజేత

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం టౌన్: టిడ్కో గృహాలను అర్హులైన లబ్ధిదారులకు ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి అందజేస్తామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధి అమీన్‌సాహెబ్‌పేట్‌లోని టిడ్కో గృహాల సముదాయాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు చైర్మన్‌ను కలిసి సమస్యలను వివరించారు. గృహాల కోసం డీడీలు చెల్లించినప్పటికీ ఇళ్లను కేటాయించలేదన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి 816 టిడ్కో గృహాలు మంజూరు కాగా వీటిలో కేవలం 187 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యావన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తిచేసి వచ్చే సంక్రాంతి సమయానికి లబ్ధిదారులకు గృహాలను అందజేస్తామని చైర్మన్ స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, టిడ్కో ఎస్ఈ డి.వి.ఎస్.మూర్తి, క్వాలిటీ కంట్రోలర్ రామిరెడ్డి, ఈఈ బి.హరి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ తదితరులు

టెక్కలి ఈవోగా శ్రీనివాస్



టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్య నిర్వాహక కార్యదర్శిగా ఎ.వి.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జలుమూరు మండలం నగరికటకం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీపై టెక్కలి వచ్చారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన వెంకట్రావు రాజాం మండలం నందబలగ బదిలీ అయ్యారు. టెక్కలి మేజర్ పంచాయతీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న శంకరరావు

మందస: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు అన్నారు. మందస తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజన సంఘాల నాయకుల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. వినతి పత్రాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని స్థానిక అధికారులకు సూచించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు సవర జగన్నాయకులు, గేదెల రమణమూర్తి, లక్ష్మీనారాయణ, రాంబాబు, ఎస్.మలత, సవర నీలకంఠం, సవర ధర్మారావు, సవర జగన్, నరసింహా, పలాస ఆర్డీవో వెంకటేష్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ అన్నెపు దొర, స్థానిక తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్, ఎంపీడీవో వై.వెంకటరమణ ఉన్నారు.

50 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి: సోంపేట ఎక్సైజ్ సిబ్బంది పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. భువనపురం గ్రామంలో సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ ఆధ్వర్యంలో సారా అమ్మకాలు, రవాణాపై మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో సుమిత్ర నాయికో అనే మహిళ నుంచి పది లీటర్ల సారాను, జెన్నాగాయి గ్రామంలో నల్ల హరిబంధు అనే వ్యక్తి నుంచి ఎనిమిది మద్యం సీసాలు నమోదు చేసుకొని ఇరువురిపై కేసులు నమోదు చేశారు. అలాగే పలాస టాస్క్ ఫోర్స్ వారు సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధి మందస మండలం పిడిమందస గ్రామంలో దాడులు చేసి కడ్డాల రాజారావు అనే వ్యక్తి నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేశారు. ఇతన్ని సోంపేట కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ జి.వి.రమణతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐ మధుకుమార్, సిబ్బంది మార్కారావు, అరుణ్, ఉమాపతి పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలి

టెక్కలి: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల నుంచి విముక్తి పొందడానికి మార్గమైన మధ్యవర్తిత్వంపై కక్షిదారులు అవగాహన పెంచుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల సూచించారు. మంగళవారం టెక్కలిలో అవగాహన ర్యాలీతో పాటు కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసుల నుంచి విముక్తి పొందడానికి మధ్యవర్తిత్వం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై న్యాయవాదులు, పోలీసులు, పారా లీగల్ వలంటీర్లు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్, మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన న్యాయవాదులు డి.వి.వివేకానంద, ఎస్.దివాకర్, ఎ.వైకుంఠరావు, డి.భుజంగరావు, న్యాయవాదులు ఎం.గోవింద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో జడ్జి నిర్మల, న్యాయవాదులు

కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో చిచ్చు రాజేయవద్దు

- ఎయిర్‌పోర్టును ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాం
- రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు
- మండల సమావేశంలో సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నీలవేణి

వజ్రపుకొత్తూరు: కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో రైతులను కాదని గుండెకాయలాంటి పచ్చని ఉద్దానంలో చిచ్చు రాజేయాలని చూస్తే సహించేది లేదని సభ్యులు స్పష్టం చేశారు. కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. వజ్రపుకొత్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, రెవెన్యూ శాఖల సమీక్షలో ఎంపీపీ నీలవేణితో పాటు మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, జోగి అప్పారావు, ఇతర సభ్యులు తహసీల్దార్ సీతారామయ్యను నిలదీశారు. ఇదే వేదికపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను రైతులు, సభ్యులు నిలదీస్తే రైతుల అనుమతి లేకుండా ఇంచీ స్థలం కూడా ఎయిర్‌పోర్టు కోసం తీసుకోబోమని స్పష్టం చేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఎయిర్‌పోర్టు పేరుతో ఆర్డీవో, ఇతర రెవెన్యూ సిబ్బంది వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లో భూముల సర్వే చేపడుతుండడంతో రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు తెలియజేయకుండా సర్వే చేసేందుకు అధికారులు ఎందుకు వస్తున్నారని తహసీల్దార్‌ను నిలదీశారు. దీనికి తహసీల్దార్ బదులిస్తూ ఇది కేవలం మట్టి నమూనాల కోసం సర్వే మాత్రమేనని చెప్పారు. రైతుల అనుమతి లేకుండా భూములు తీసుకోమని స్పష్టం చేశారు. సభ్యులు మరికొన్ని సమస్యలను సభలో ప్రస్తావించారు. బెండిగేటు– నువ్వలరేవు, అక్కుపల్లి– కాశీబుగ్గ రహదారిని పది రోజుల్లో నిర్మిస్తామని ఆరు నెలల క్రితం చెప్పిన ఎమ్మెల్యే శిరీష ఇప్పటివరకూ తట్టెడు మట్టి వేయలేని అసమర్థ పాలన చేస్తున్నారని ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీల్లో గుండెపోటును నియంత్రించే ఇంజక్షన్లను అందుబాటులో ఉంచాలని, కిడ్నీ రోగులు డయాలసిస్‌కు వెళ్లే సమయంలో ఆటో, ఇతర వాహనాల కోసం రోజుకు రూ.వెయ్యి వరకు చెల్లించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అక్కుపల్లి సర్పంచ్ లండ లోలాక్షి, సైనూరు సర్పంచ్ ఎ.గోవిందరావు, సభ్యులు కరుణాకర్, మరడ భాస్కరరావు అన్నారు. కిడ్నీ రోగుల కోసం 108 వాహనాన్ని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయని వీటిని సద్వినియోగంలోకి తీసుకురావడంలో విఫలమతున్నారని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో ప్రధాన సాగు నీటి వనరులుగా ఉన్న చెరువులు కబ్జాకు గురవుతుండడంతో రైతులకు తీవ్రనష్టం జరుగుతోందని దోకులపాడు ఎంపీటీసీ సభ్యుడు కె.డిల్లేశ్వరరావు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంకటాపురం పీహెచ్‌సీ సేవలు వజ్రపుకొత్తూరు మండల పరిధి వరకే అమలయ్యేలా చూడాలని సర్పంచ్ కె.మల్లేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు మరడ భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రెండుసార్లు నిర్వహించిన మండల సమావేశాలకు గైర్హాజరవుతున్నారని.. సంబంధిత అధికారులపై శాఖా పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. పీహెచ్‌సీల్లో సుగర్ పరీక్షలు చేసేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వ్యాధిగ్రస్తులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని పలువురు సభ్యులు అన్నారు. నగరంపల్లిలో జలజీవన్ మిషన్ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధ జలాలు అందడం లేదని, ట్యాప్‌లు లేవు సరికదా ఎయిర్ వాల్వ్‌లు లేక ఎత్తు భాగానికి నీరు ఎక్కడం లేదని ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి మోహనరావు అన్నారు. వంశధార రిజర్వాయర్ నుంచి సాగు నీరు అందించాలని కోరారు. వర్షాలు సక్రమంగా కురవకపోతే వరివెదలపై ప్రభావం చూపితే మళ్లీ విత్తనాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏవో ధనుంజయరావును సభ్యులు కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణి, మండల విప్ తిర్రి గుణ, తహసీల్దార్ సీతారామయ్య పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



పీఎం జన్ ఆరోగ్య యోజనపై టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ 14వ బెటాలియన్ ఆధ్వర్యంలో కెప్టెన్ రవికుమార్ నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులతోపాటు ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డీన్ డి.విష్ణుమూర్తి, ఎన్‌సీసీ ఎల్‌టీ టి.మురళీమోహన్, భుజంగరావు పాల్గొన్నారు.

– టెక్కలి

అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్‌లు, రమ్మీ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ శక్తి టీం ఎస్ఐ రవికుమార్ అన్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి సాయివినీత్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు శక్తి యాప్ ఉపయోగాలు, వినియోగించే విధానంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా ఓటీపీల ద్వారా జరుగుతున్న మోసాలపై అవగాహన అవసరమన్నారు. వివిధ అంశాలపై వీడియో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎ.కైలాశరావు, జి.సాయిగోపాల్, బత్తిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

–వజ్రపుకొత్తూరు

యువతే కీలకం



సామాజిక సేవల్లో యువత కీలక పాత్ర పోషించాలని నేషనల్ వలంటీర్ హంగీర్ బెహరా కోరారు. ప్రపంచ యువత దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో యువకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేటి యువత భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని, ఉపాధి అవకాశాలను కల్పించుకొని ఎదగాలని అన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

పోలీసుల బదిలీల్లో రోస్టర్ పాయింట్లు అమలు చేయాలి

టెక్కలి: పోలీస్ శాఖలో పని చేసే సిబ్బంది బదిలీల్లో ఎస్సీ, ఎస్టీ వారికి రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లు అమలు చేయాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ మేరకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్రావుకు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ విషయంలో రిజర్వేషన్ పాటించకుండా అడ్డగోలుగా బదిలీలు చేస్తున్నారన్నారు.

క్లుప్తంగా

బీఎల్‌వోలకు ముగిసిన శిక్షణ

పలాస: రోజురోజుకు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) మారాలని పలాస ఆర్డీవో జి.వెంకటేశ్ అన్నారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు ఐదు రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. మారిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఓట్లు నమోదు ఇతర కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పలాస తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

ఆపస్ నూతన కార్యవర్గం

కంచిలి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పద్మతుల ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మురపాల జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.ఎస్.పల్లి మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం లాస లక్ష్మణరావుతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరారావు, జిల్లా కోశాధికారి చలపాక రమణ, జిల్లా కార్యదర్శులు నర్తు సోమేశ్వరరావు, ఆసి పురుషోత్తం పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సోంపేట: ఎరువుల దుకాణాల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు భవానీశంకర్ అన్నారు. సోంపేట పట్టణంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. లైసెన్సుదారులు తమవద్ద ఉన్న నిల్వలను రోజూ స్టాక్ బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు.

లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి

ఇచ్ఛాపురం రూరల్: కేవలం వర్షాధారం పైనే ఆధారపడే తమ భూములపై రెండు పంటలు పండించుకునే అవకాశం లేనందున స్థానిక బహుదానది పరీవాహకం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని అరకబద్ర గ్రామ రైతులు కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక రైతులు అధికారులకు తమ సమస్యను వివరించారు. బహుదానది తమ చెంతనే ఉన్నప్పటికీ సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, కనీసం పంపుసెట్‌లు అయినా ఏర్పాటు చేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజేయ్‌కుమార్ తెలియజేశారు. వ్యవసాయ సహాయకులు దీక్షిత్, వెంకటేష్ పాల్గొన్నారు.

బాలియాత్రను జయప్రదం చేయండి

వజ్రపుకొత్తూరు: శ్రీముఖలింగం దివ్య, భవ్య క్షేత్రంలో కార్తీక పౌర్ణమి రోజున చేపట్టే బాలియాత్రను జయప్రదం చేయాలని బాలియాత్ర–2025 నిర్వహణ కమిటీ ప్రతినిధి డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. ఈ మేరకు యాత్రకు సంబంధించిన విషయాలను మంగళవారం వెల్లడించారు. బాలి యాత్ర కాళింగ సామాజికవర్గానికి చెందినది కాదని స్పష్టం చేశారు. ఈ యాత్రకు మంచి విశిష్టత ఉందని, ఆధారాలు సైతం అందుబాటులో ఉన్నాయని అన్నారు. యాత్ర విశిష్టతను తెలుసుకొని జయప్రదం చేయాలని కోరారు.

18న వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సంతబొమ్మాళి: దండుగోపాలపురంలో ఈ నెల 18వ తేదీన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ నేతృత్వంలో జరగనున్న మండలస్థాయి పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి నక్క భీమారావు, నాయకులు మార్పు నాగభూషణరావు, పంగ రామయ్య ఉన్నారు.

ట్యాబ్‌లు అందజేత

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో మెప్మా విభాగంలో పనిచేస్తున్న ఆర్పీలకు, పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి ట్యాబ్‌లు, పుష్‌కార్ట్‌లను మంగళవారం పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ నాయకులు లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, అంబటి క్రిష్ణమూర్తి, కమిషనర్ నడిపేన రామారావు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సాయికాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలాస యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. రక్తదాన ఆవశ్యకతను ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రెడ్డి చిన్నంనాయుడు వివరించారు.